# వధువులు కావాలి

-డా॥ బి.దామోదరరావు

ఈరోజు నన్నాకర్షించిన ప్రకటన ఇది; కేవలం వధువులే కావాలా! సంప్రదించండి! స్వయంగా చూచి ఎన్నిక చేసుకోవాలి.

సెల్ నెం, చిరునామా స్పష్టంగా ఉంది. ఇదో 'మార్టిమోనియల్' ప్రకటన అనుకున్నా; కాని ఆ ఇంటికి వెళ్ళాక తెల్సింది;

మాణిక్యాల మగువలు
మరకతాల మగువలు
మురిపాల మగువలు
ముల్లుల మగువలు

-అంటూ బోర్డులో కనిపించిన చక్కని ప్రచార ప్రకటన నన్ను ఆశ్చర్యపడేలా చేసింది- లోనికి వెళ్ళా - వెళ్ళగానే 'హలో కాఫీ' అందించిందో అతివ.

ఓ పెద్ద ముత్తైదువ వచ్చి నా ఎదురుగా సోఫాలో కూచుంది.

"మీకే క్వాలిఫికేషన్ ఉన్న అమ్మాయి కావాలి? మీ అభిరుచికి తగ్గట్టుగా ఫోటొబయోడాటాతో ఉన్న 'ఆల్బమ్'లో చూచి ఎన్నుకోండి; మీ ఎన్నికే ఫైనల్, కొండమీద కోతిని తెచ్చిపెడ్తా!"

"కోతినా, అబ్బే వద్దులెండి" అన్నా మోహమాట పడ్తూ.

"అది కాదండి, నాకు అసాధ్యమంటూ లేదని దాని అర్థం" అంటూ పకపకా నవ్వింది.

"అదేమిటీ! ఆ అమ్మాయి ఒప్పుకోవద్దూ" అడిగా సందేహంతో. అది మేము చూచుకుంటాం, అమ్మాయిలు దొరకడంలేదని వరుల బెంగ; అందువల్ల వధువుల పక్షాన ఈ ఏర్పాటు. వధువులు దొరికే వనరులు తగ్గిపోయాయి" అంది. ఆవిడ నాతో పాటు కాఫీ తాగుతూ,

నేనో పత్రికాఫీసులో సబ్ ఎడిటర్ అని పరిచయం చేసుకున్నాక జరుగుతున్న సత్కారమిది.

"కాస్త వివరంగా చెప్పండి!- పత్రిక విలేఖరిగా మారి మరీ అడిగా- మరేంలేదు సార్ అమ్మాయిల గురించి మా ఇన్వెస్టిగేటింగ్ టీమ్- అమ్మాయిలున్న తల్లిదండ్రులను గుర్తించి, వారిని మా ఏజెన్సీ ద్వారానే పెండ్లి కుదిరించాలనీ ఒప్పించి అడ్వాన్స్ ఇస్తాం- కట్నం తీసుకోని సంబంధాలే ఎన్నిక చేస్తాం; కాబట్టి మా ఏజెన్సీకి గిరాకీ ఎక్కువ" సంతోషంగా చెబుతోంది. "దీంతో మా వద్దకు అమ్మాయిల తండ్రులు మరీ వచ్చి పేర్లు నమోదు చేసుకుంటున్నారు. నిజానికి డిమాండ్‌కు తగ్గట్టుగా సప్లై చేయలేకపోతున్నాం. వరుల సంఖ్య రెట్టింపు కదా. పైగా అందరూ మంచి అమ్మాయి- అంటే, అందం, చదువు, కోరుకుంటున్నారాయే. దీనికి ప్రత్యేకమైన కమిషన్, అబ్బాయిల నుంచి ముట్టుంది లెండి" అంది మందహాసం చేస్తూ!

"ఇదో రకం సేవే కదా సార్" అంది గొప్పగా ఫీలవుతూ-

"ఆ, కాదు మరీ, ప్రపంచీకరణ నేపథ్యంలో ఇదో గొప్ప బిజినెస్" అన్నాను.

"మరి మీరు వధువుల కుటుంబాల నుంచి ఏమాత్రం ఫీజు తీసుకుంటారు" అడిగా ఆసక్తిగా.

"అదా, నిర్బంధం లేదు లెండి. అబ్బాయి పక్షాన్నే మాకు గిట్టుబాటు ఎక్కువ. వారి ఆసక్తిని, అభిరుచిని బట్టి గుంజుతాం అనబోయి అడుగుతాం" అంది. బేరం

## అభినందన గీతిక!

శాంతిని బోధించే / శ్వేతకపోత రెక్కల
సవ్వడుల్లోంచి / సెలయేటి అలజడుల్లోంచి
పారేటి పిల్లకాలువల్లోంచి
ఎగిరేటి నదీనదంలోంచి
ఎగిసిపడే కడలి కెరటంలోంచి
ప్రతిఫలించి ప్రతిధ్వనించి
ఓంకారనాదమై అస్థిత్వానికి బీజమై
సమాజంలో మమేకమై
హితకారిణిగా సన్నిహితమై
సాహితీపరంపరలతో/ సృష్టికి ప్రతిసృష్టిగా నిలిచి
అందరిచే బాగుంది / సెహభాష్ అనిపించి
ఎన్నెన్నో వినూత్న ప్రశంసల్నందుకున్న
ఓ నా పత్రికా! మన మాసపత్రికా!
సాహితీ కళామతల్లి ముద్దుల పత్రికా!
అందుకో ఇదే నీకు నేనందించే
ఈ నా అభినందన గీతిక!

-దోసపాటి సత్యనారాయణమూర్తి

కుదిరాకే అమ్మాయితో పెండ్లి చూపులు ఏర్పాటు చేస్తాం. కుదిరితే, డేట్, హాలు, పెండ్లి ఏర్పాట్లు అన్నీ మేమే చూచుకుంటాం అంది "మరి పెండ్లి ఖర్చులు!" అడిగా.

"అవన్నీ అబ్బాయి వాళ్ళు, అమ్మాయిల డిమాండ్ మేరకు, జ్యూయలరీ, బట్టలు పెట్టి. వాళ్ళ కోరిక మేరకు ఎక్కడ అంటే అక్కడ వాళ్ళు నిబంధనలు అంగీకరించి చేసుకోవాలి" అంది ఆయాలా ఉన్న ఆ ముత్తైదువ.

"నిబంధనలా! అవేమిటీ!" మరింత ఆసక్తి పెరిగింది.

"జెస్ట్ సింపుల్. అబ్బాయి అమ్మాయి ఇంట ఉండాల్సి ఉంటే ఒప్పుకోవాలి. ఫ్లాట్, కారు ఉంటే, ప్రాముఖ్యత, అమ్మాయి పేర బ్యాంక్‌లో అయిదు లక్షల వరకు ఫిక్స్‌డ్ డిపాజిట్ వట్టి ఆర్థిక విషయాలు కాక, సామాజిక సమస్యలు ఉన్నా తీర్చాలి" అంది ఖచ్చితంగా.

"సామాజిక సమస్యలా!" అవేమిటీ అడిగా-

"మరేం లేదు; తల్లిదండ్రులకు ఒకతే కూతురైతే, అమ్మాయి తల్లిదండ్రుల పోషణ ఖర్చు వరులదే; వాళ్ళ సోదరుల పెండ్లి బాధ్యత కూడా అబ్బాయి తరపు వాళ్ళదే" ఆమె అంటున్నది. నేనేనా వింటున్నది; కాస్సేపు అమోమయం.

"వీటికి సిద్ధం కాకపోతే" అనుమానంగా అడిగా-

"అప్పుడు, మేము చెప్పిన అమ్మాయినే అబ్బాయి అంగీకరించాలి" ఇది కూడా వాళ్ళ చేతిలో విషయమే అని స్పష్టం చేసింది.

"గత మూడేళ్ళుగా, తమ్ముడికి వధువులు దొరకడం లేదు కదా. వెతకాలని, బయలుదేరితే, ఇదో కొత్త అనుభవం.

సరే, కానీయ్, ఈ విధంగానైనా, 'వరకట్నం, మరోరకం కన్యాశుల్కానికి దారితీస్తుందేమో! అమ్మాయిలకు విలువ, గౌరవం పెరుగుతుందేమో! సమాజం ప్రతిదీ, అర్థం చేసుకుని ఆదరించబట్టే కదా"

ఎన్ని అవాంతరాలు వచ్చినా సజావుగా సాగిపోతుంది. పైగా, సంస్కృతిలో ఈ వెసులుబాటు 'సృష్టి' సృష్టిస్తుందే కదా! ఓనాడు స్త్రీలు, మరోనాడు పురుషులు, ఆధిక్యత ప్రదర్శిస్తారేమో!" అనుకుంటూ.

"మంచిదమ్మా, నేను ఇంటికి వెళ్ళి, విషయాలు మా శ్రీమతికి చెప్పి మళ్ళీ వస్తాం? మరి సెలవా!" అంటూ బయటపడ్డాను.

■

# రూపం

అనుకోవడానికైనా కొంత సమయం
తిట్టుకోవడానికైనా ఇంత తీరుబాటు
మోసపోవటం ఒక రకం గాసం
విన్నది విన్నట్టు చెప్పింది చెప్పినట్టు
తూచ తప్పకుండా పాటించడం
నేను నేనేనా? నువ్వు నువ్వేనా
ఆమోద అనామోదాలకేం
ముఖాముఖి ఉండనే ఉన్నాం
బయల్పడని లోపం
తవ్వుకొని తలపోసుకొని
నువ్వైనా నేనైనా
ఇప్పటికే ఎప్పుడో కల్సి ఉండాల్సింది
కలహానికుంచినంత సమయమైనా
కలువడానికివ్వకపోతిమిగదా!
తగాదా అగాధం
బాగోతమ్ముందు
జాగాపుకున్నంత సులువుగా
కలిసి ఉండకపోతిమి గదా!
మాటకు మాట దూరం భారం
కొట్టుకోవడానికింత నిర్దయ
ముట్టుకోవడానికింత సామీప్యం
తట్టుకోవడాని కింత దారుఢ్యం
బలత్కరించడానికింత బలుపు
బతిమిలాడటానికింత వలపు
నిరాశ్రయం పరాశ్రయం
ఒకింత తలచుకుంటే
మనమింతగా చించుకుంటున్నది దేనికి?
పక్షుల్లా అట్లా ఎగిరి పోతేనేం
అగ్గిలా ఇట్లా బూడిదైతేనేం
నిలబడటమూ నిలబడకపోవడమూ
రెండూ నిరాధారం నిరాశ్రయం పరాశ్రయం
అగమ్యం అయోగ్యం నిర్హేతుకం
గురి చూసి కొట్టేవాడిదే లక్ష్యం
గుడ్డివాడి ఆశయం పరహాస్యం
దాచుకున్నా మూసుకున్నా
రూపం దీపోత్తేజ సమ్మిళితం

-చైతన్య ప్రకాశ్